సాక్షి
నాగర్‌కర్నూల్
గురువారం : 30 : జనవరి : 2025

గరిష్టం/కనిష్టం
35.5 / 12.7

వాతావరణం
ఉదయం, రాత్రివేళ చలి తీవ్రత ఉంటుంది. మంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం కనిపిస్తుంది.


ఒంటె వాహనంపై ఊరేగుతున్న అభయాంజనేయ స్వామి

ఒంటె వాహనంపై ఊరేగిన అభయాంజనేయుడు

ఊర్కొండపేటలో అభయాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం స్వామివారికి పంచామృత అభిషేకాలు, అష్టోత్తర పూజలు చేశారు. సాయంత్రం ఒంటె వాహన సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ నామస్మరణ మార్మోగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.
- ఊర్కొండ

న్యూస్‌రీల్

నేటి నుంచి పాలెం వెంకన్న బ్రహ్మోత్సవాలు

బిజినేపల్లి: భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న పాలెం వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఫిబ్రవరి 2న అలివేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం, 4న స్వామివారి రథోత్సవం నిర్వహించనున్నారు. 6వ తేదీ వరకు కొనసాగే బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ ఈఓ రంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ ధర్మకర్తగా మనుసాని విష్ణుమూర్తి గురువారం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు పేర్కొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్



కల్వకుర్తి టౌన్: చదువులో ఎంత బాగా రాణిస్తే.. అంత గొప్ప భవిష్యత్ ఉంటుందని చార్మినార్ ఎమ్మెల్యే జుల్ఫికర్ అలీ అన్నారు. బుధవారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఉర్దూ మీడియం విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉన్నత విద్య అభ్యసించాలనే ఆకాంక్ష ఉన్న విద్యార్థులకు పేదరికం అడ్డు కాకుండా ప్రభుత్వం పలు విద్యా పథకాలను అమలు చేస్తోందన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యలో రాణించాలని సూచించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో కల్వకుర్తి ఎంఐఎం అధ్యక్షుడు సత్తార్, మజహర్ పాల్గొన్నారు.

బాలలతో పనులు చేయిస్తే కేసులు



కల్వకుర్తి టౌన్: ఎవరైనా బాలలతో పనులు చేయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జిల్లా అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మహేందర్‌రావు అన్నారు. బుధవారం పట్టణంలోని పలు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. బస్టాండ్ సమీపంలోని రెండు దుకాణాల్లో ఇద్దరు బాలకార్మికులను గుర్తించారు. దుకాణ యజమానులకు సీఐ నాగార్జున ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం బాలకార్మికులను జిల్లా కేంద్రంలోని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరుపరచగా.. దుకాణ యజమానులపై కేసు నమోదు చేయటంతో పాటు జరిమానా విధించినట్లు తెలిపారు. తనిఖీలలో ఆపరేషన్ స్మైల్ బృందం ఎస్ఐ కృష్ణయ్య, ఏఎస్ఐ వెంకటయ్య, హెడ్ కానిస్టేబుల్ పద్మావతి, రామకృష్ణ, కానిస్టేబుల్ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత క్యాంపస్‌గా తీర్చిదిద్దుదాం



కొల్లాపూర్: పాలమూరు యూనివర్సిటీ క్యాంపస్‌ను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు విద్యార్థులు బాధ్యతాయుతంగా కృషి చేయాలని పీజీ కళాశాలల డైరెక్టర్ ఎం.జై పాల్‌రెడ్డి సూచించారు. 'పర్యావరణం-సుస్థిర అభివృద్ధి' అంశంపై కొల్లాపూర్ ప్రభుత్వ పీజీ కళాశాలలో నిర్వహించిన సదస్సుకు ఆయన హాజరై ప్రసంగించారు. పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని సూచించారు. ప్రొఫెసర్ రవీందర్‌రేరా తదితరులు మాట్లాడుతూ.. సదస్సులో చర్చించిన అంశాలను ఆచరణలో పాటించాలన్నారు. ఇందులో విద్యార్థుల పాత్ర కీలకమైనదన్నారు. అనంతరం యూనివర్సిటీకి చెందిన క్యాలెండర్లను ఆవిష్కరించారు. సదస్సులో పీజీ కళాశాల ప్రిన్సిపాల్ మార్క్ పోలోనియస్, అధ్యాపకుడు దేవరాజ్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సంబురం

- నేటి నుంచి జోగుళాంబ వార్షిక బ్రహ్మోత్సవాలు

వివరాలు 8లో ▸



అందని 'భరోసా'..

పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్న రైతులు


పొలంలో పనిచేస్తున్న రైతు

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 13,23,813 మంది అర్హులు
- ఇప్పటివరకు భరోసా ఇచ్చింది 57,914 మందికే..
- మండలానికి ఒక్క గ్రామ రైతులకే సొమ్ము జమ చేసిన ప్రభుత్వం
- మిగతా వారికి ఎప్పుడన్నదానిపై స్పష్టత కరువు



సాక్షి, నాగర్‌కర్నూల్: ప్రభుత్వం రైతుభరోసా కింద రైతులకు అందిస్తున్న పెట్టుబడి సాయం కొందరికే అందింది. మండలానికి ఒక్క గ్రామం చొప్పున ఎంపిక చేసి ఆ గ్రామంలోని రైతులకే ప్రభుత్వం భరోసా కింద ఆర్థికసాయాన్ని అందజేసింది. ఇంకా సాయం అందాల్సిన వారు పెద్దసంఖ్యలో ఉండటంతో తమ వంతు ఎప్పుడు వస్తుందా? అని ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ పథకం కింద అర్హులైన రైతులందరికీ ఎప్పటి నుంచి ప్రభుత్వ సాయం అందుతుందన్న దానిపై స్పష్టత కరువైంది.

5 శాతం లోపు రైతులకే..

రైతు భరోసా పథకం కింద ఈసారి ప్రభుత్వం ఒక్కో ఎకరాకు తొలి విడతలో రూ.6 వేల చొప్పున పెట్టుబడి సాయాన్ని అందిస్తోంది. ఈ నెల 26న రైతుభరోసా పథకాన్ని ప్రారంభించినా, ఆ రోజున బ్యాంకులకు సెలవు కావడంతో 27న ఉదయం నుంచి లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్ము జమైంది. అర్హులైన రైతులందరికీ ఒకేసారి కాకుండా, మండలానికి ఒక గ్రామం చొప్పున అధికారులు ఎంపిక చేసిన గ్రామాల్లోని రైతుల ఖాతాల్లో మాత్రమే ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని జమ చేసింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 13,23,813 మంది రైతులు ఈ పథకానికి అర్హులుగా తేలగా, ఇప్పటి వరకు ప్రభుత్వ సాయాన్ని అందించింది 57,914 మందికే. కేవలం 5శాతం లోపు రైతుల మాత్రమే సాయాన్ని అందుకోగా, ఇంకా పెద్ద సంఖ్యలో రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం సకాలంలో వ్యవసాయానికి ఆర్థికసాయాన్ని అందించాలని కోరుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో రైతుభరోసా పథకం వివరాలు: (రూ. కోట్లలో)

జిల్లా	అర్హులైన రైతులు	మొత్తం డబ్బులు	సాయం పొందిన రైతులు	జమ చేసిన డబ్బులు
మహబూబ్‌నగర్	2,50,239	276.09	14,526	17.23
నాగర్‌కర్నూల్	3,30,836	451.26	16,806	23.01
వనపర్తి	3,68,799	442.56	9,415	12.21
జోగుళాంబ గద్వాల	1,81,919	278.80	7,819	12.45
నారాయణపేట	1,92,020	275.18	9,348	13.87

'ఆత్మీయ'తకు దూరమే..

రైతుభరోసా పథకంతో పాటు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద సాయానికి సైతం రైతు కూలీలు నిరీక్షిస్తున్నారు. ప్రభుత్వం భూమి లేని నిరుపేదలకు సైతం ఏటా రూ.12 వేలు ఆర్థికసాయాన్ని అందిస్తామని చెబుతోంది. ఇప్పటివరకు మండలానికో గ్రామం చొప్పున ఎంపిక చేసిన గ్రామాల్లోని లబ్ధిదారులను గుర్తించి వారి ఖాతాల్లో జమ చేశారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 18,180 మందికి జమ చేశామని ప్రభుత్వం చెబుతుండగా, ఉమ్మడి జిల్లాలో ఈ సంఖ్య వందలకే పరిమితమైంది. ఆత్మీయ భరోసా కింద సాయం పొందేందుకు ఉపాధి హామీ పథకంలో పని చేయాలన్న నిబంధన పెట్టడంతో చాలామంది నిరుపేదలు ఈ పథకానికి దూరం అవుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ నిబంధనను సడలించి, భూమిలేని రైతు కూలీలు అందరికీ ఇవ్వాలని కోరుతున్నారు.

సాగు లెక్కలపై సా..గుతున్న కసరత్తు..

ఈసారి రైతుభరోసా కింద సాయం అందించేందుకు కేవలం వ్యవసాయ యోగ్యమైన భూములకు మాత్రమే పెట్టుబడి సాయాన్ని అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పౌల్ట్రీ, రియల్ ఎస్టేట్ వెంచర్లు, లేఅవుట్లు, ఫిషరీస్, నాలా కన్వర్షన్, కమర్షియల్ తదితర భూములను గుర్తించి ఈ పథకం లబ్ధిదారుల జాబితా నుంచి తొలగిస్తోంది. అయితే అర్హులైన రైతులందరికీ సాయం అందించేందుకు లబ్ధిదారుల తొలగింపు ప్రక్రియ పూర్తికాక పోవడమే అడ్డంకిగా మారింది. వ్యవసాయ యోగ్యం కాని భూములను గుర్తించి ఫ్రీజ్ చేస్తేనే మిగతా వారికి ఇచ్చేందుకు మార్గం సుగుమం కానుంది. ఒకే సర్వే నంబరులో ఉన్న వ్యవసాయ భూములు, వ్యవసాయ యోగ్యం కాని భూములను ఫ్రీజ్ చేసే విషయంలో పీటముడి నెలకొంది. ఈ కసరత్తు ఇంకా కొనసాగుతుండటంతో మరో వారం రోజుల తర్వాతే మిగతా రైతులకు ప్రభుత్వ సాయం అందించే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది.

ఇప్పట్లో వస్తాయన్న నమ్మకం లేదు..



నాకు మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో రెండు ఎకరాల్లో మొక్కజొన్న, మరో ఎకరంలో వరి సాగుచేస్తున్నా. ఇప్పటికే నాట్లు వేసుకున్నా. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం అందలేదు. గత వానాకాలం సీజన్‌లో కూడా ఇవ్వలేదు. ఇప్పట్లో ఇస్తదన్న నమ్మకం కూడా కుదరడం లేదు. ప్రభుత్వం సకాలంలో రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించాలి.
– చిటమోని సుధాకర్, గట్టురాయిపాకుల, తెలకపల్లి మండలం

వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నాం..



నాకు రెండెకరాల పొలం ఉంది. రైతుభరోసా కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నాం. ఈ నెల 26 నుంచి రైతుభరోసా డబ్బులు ఖాతాలో పడతాయని చెప్పినా ఇంతవరకు మా తండాలో ఒక్క రైతుకు కూడా డబ్బులు రాలేదు. గత ప్రభుత్వంలో రెండెకరాలకు రూ. 20వేల పంట పెట్టుబడి సాయం అందేది. ఇప్పుడు డబ్బులు వచ్చేదాక నమ్మకం లేదు.
– సభావట్ పూల్యానాయక్, రైతు, గుట్టమీదితండా, ఉప్పునుంతల

మండలానికో గ్రామమేనా..



మండలానికో గ్రామాన్ని ఎంపిక చేయడం ఎంతవరకు సమంజసం. మా కుటుంబానికి నాలుగెకరాల భూమి ఉంది. అందులో వరి పంట సాగు చేశాను. రైతు భరోసా వస్తుందనే నమ్మకంతోనే వడ్డీపై డబ్బులు తీసుకువచ్చా. ఇంతవరకు పెట్టుబడి సాయం అందలేదు. నాతో పాటు గ్రామంలో చాలామంది రైతు భరోసా రాకపోవడంతో సాగు కోసం వడ్డీ వ్యాపారులు, బ్యాంకులలో అప్పులు చేయాల్సి వస్తుంది. గత ప్రభుత్వంలో సీజన్ ప్రారంభానికి ముందే రైతుబంధు డబ్బులు ఖాతాల్లో పడేవి. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే తర హాలో అందరికీ ఒకేసారి వస్తే బాగుంటుంది.
–దొబ్బలి మొగులయ్య, రామచంద్రాపూర్, మహబూబ్‌నగర్ రూరల్

కసరత్తు కొనసాగుతోంది..

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రైతుభరోసా కింద ఇప్పటివరకు ప్రతి మండలంలో ఎంపికచేసిన గ్రామాల్లోని రైతుల ఖాతాల్లో ప్రభుత్వ సాయం జమ అయింది. మిగతా గ్రామాల్లోనూ వ్యవసాయ యోగ్యమైన భూములపై కసరత్తు ఇంకా కొనసాగుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలోనే రైతులందరికీ సాయం అందుతుంది.
– చంద్రశేఖర్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, నాగర్‌కర్నూల్

పదేళ్ల కాలంలో 'గువ్వల' చేసిందేమీ లేదు

- అధికారాన్ని అడ్డుపెట్టుకుని అచ్చంపేటలో దౌర్జన్యాలు
- త్వరలోనే అన్ని లెక్కలు తేలుస్తాం
- డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే వంశీకృష్ణ


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

నాగర్‌కర్నూల్: ప్రతిపక్ష నాయకులపై కేసులు బనాయించడం.. నల్లమలలో గుంతలు తవ్వడం తప్ప అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పదేళ్ల కాలంలో చేసిందేమీ లేదని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. ఆయనను గుంతల బాలరాజుగా అభివర్ణించారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం ఎమ్మెల్యే వంశీకృష్ణ విలేకరులతో మాట్లాడారు. రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లో గువ్వల బాలరాజు కాంగ్రెస్ ప్రభుత్వంపై చేసిన ఆరోపణలను ఖండించారు. బీఆర్ఎస్ హయాంలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఎన్ని నెరవేర్చారో చెప్పాలన్నారు. డబుల్‌బెడ్రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూ పంపిణీ, దళితుడిని సీఎం చేస్తామన్న హామీలను ఎందుకు నిలబెట్టుకోలేదని ప్రశ్నించారు. కేసీఆర్ దత్తత తీసుకున్న పాలమూరుకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. అచ్చంపేట నియోజకవర్గంలోనూ గువ్వల బాలరాజు 30 గ్రామాలను దత్తత తీసుకుని చేసిందేమీ లేదన్నారు. నల్లమలలో గుప్తనిధుల కోసం గుంతలు తవ్వుతుంటే.. నాలుగుసార్లు పట్టుకున్నామన్నారు. సొంత పార్టీ నాయకులనే కొట్టిన చరిత్ర గువ్వలదని అన్నారు. ఎవరిని ఎవరు కొట్టించారో తన వద్ద జాబితా ఉందన్నారు. ఫోన్ ట్యాపింగ్, భూముల ఆక్రమణ, సీడీఎఫ్ నిధుల లెక్కలన్నీ ప్రజల ముందుంచుతామన్నారు. అచ్చంపేటలో ఏ పదవులను ఎంతకు అమ్ముకున్నాడో తన వద్ద లెక్కలున్నాయన్నారు. కరోనా సమయంలోనూ రూ. కోట్లు వసూలు చేశారని.. కార్యకర్తల వద్ద రూ.25 కోట్ల అప్పుచేసి ఎగ్గొట్టాడని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో మందకృష్ణను 40 రోజుల పాటు జైలుపాలు చేస్తే సమర్థించిన వ్యక్తి.. ఇప్పుడు కులరాజకీయాలు చేస్తున్నాడంటూ మండిపడ్డారు. సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో ఓ విద్యార్థిని చనిపోతే రాత్రికి రాత్రే తీసుకెళ్లి ఖననం చేయించిన వ్యక్తికి దళితుల గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిది కుటుంబ పాలన అని మాట్లాడుతున్న గువ్వల బాలరాజు.. సీఎం ఇంట్లో ఎన్ని పదవులు ఉన్నాయో చెప్పాలన్నారు. ఎన్నికలకు ముందు అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణంపై ఒక కాగితం తెచ్చి చేతులు దులుపుకొంటే.. తాను ఆ ప్రాజెక్టు కోసం రూ. 2,367 కోట్లు మంజూరు చేయించానని ఎమ్మెల్యే వంశీకృష్ణ చెప్పారు. త్వరలోనే ముఖ్యమంత్రితో శంఖుస్థాపన చేయిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఉమామహేశ్వరస్వామి బ్రహ్మోత్సవం రోజున కేవలం తనకు ఆహ్వానం పలకలేదని ధర్నాచేసి.. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయించడం జరిగిందన్నారు. ఇన్నేళ్ల రాజకీయ జీవితంలో తాను ఇలాంటి రాజకీయాలు చేయలేదన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు


జంతు జనన సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్: వీధి కుక్కలతో ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులను తీర్చేందుకు ప్రత్యేకంగా చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. జిల్లా కేంద్రమైన నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలో పట్టణప్రగతి నిధులు రూ. 60 లక్షలతో నిర్మించిన జంతు జనన సంరక్షణ కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, అదనపు కలెక్టర్ దేవ సహాయంతో కలిసి కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. వీధి కుక్కల సంఖ్య నియంత్రణతో పాటు వాటి ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు ఎనిమల్ బర్త్ కేర్ సెంటర్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. స్టెరిలైజేషన్ ప్రక్రియ ద్వారా కుక్కల సంఖ్యను నియంత్రించి.. వీటి వల్ల ప్రజలకు కలిగే సమస్యలను తగ్గిస్తామన్నారు. జంతు జనన సంరక్షణ కేంద్రంలో అందించే వైద్యసేవల్లో భాగంగా వీధి కుక్కలను పట్టుకుని జనన నియంత్రణ ఆపరేషన్లు చేయడంతో పాటు రాబిస్, పార్వో వైరస్, డిస్టెంపర్ వంటి వ్యాధుల నిరోధక టీకాలు వేయనున్నట్లు తెలిపారు. వాటికి స్టెరిలైజేషన్ అనంతరం తిరిగి సహజ జీవావరణంలో వదిలే విధానాన్ని అమలుచేస్తారన్నారు. ఆపరేషన్ పూర్తయిన కుక్కలు పూర్తి ఆరోగ్యంగా మారిన తర్వాతే తిరిగి వాటి ప్రాంతాల్లో వదిలేస్తారని.. ప్రజలకు వీధి కుక్కల ప్రవర్తన, సంరక్షణ, వీటి జనన నియంత్రణ అవసరాన్ని వివరించేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు కలెక్టర్ వివరించారు.

ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ.. వీధి కుక్కల సమస్యను సమర్థవంతంగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వీధి కుక్కల పెరుగుదల నియంత్రణతో పాటు వాటి ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అందులో భాగంగా జంతు జనన సంరక్షణ కేంద్రం ప్రారంభించినట్లు చెప్పారు. స్థానిక సంస్థల సహకారంతో శునకాల సంరక్షణ, జనన నియంత్రణ కోసం మరిన్ని నిధులు కేటాయించే ప్రయత్నం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి జీవీ రమేష్, మున్సిపల్ కమిషనర్ నరేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

వ్యవసాయ మార్కెట్‌లలో వేరుశనగ విక్రయించేందుకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్ బదావత్ సంతోష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులకు మద్దతు ధర తదితర అంశాలపై మార్కెట్ కమిటీ చైర్మన్లు, మార్కెటింగ్ శాఖ అధికారులతో బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్ నుంచి గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మార్కెట్ పాలకవర్గాలు, అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. జిల్లాలో వేరుశనగ పంటకు కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 6,783 అందించాలని తెలిపారు. రైతుల అవసరాలను తీర్చడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. స్థానిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో వేరుశనగ సాగు విస్తీర్ణం.. కొనుగోలు అంశాలపై పూర్తి అవగాహనతో ఉండాలని తెలిపారు.

'ఉమామహేశ్వర' సర్వేను అడ్డుకున్న రైతులు


సర్వేను అడ్డుకుంటున్న రైతులు

అచ్చంపేట రూరల్: మండలంలోని గుంపన్‌పల్లి, అచ్చంపేట శివారులో ఉమామహేశ్వర రిజర్వాయర్ కాల్వ సర్వే పనులను బుధవారం అధికారులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న కొందరు రైతులు సర్వే పనులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. రిజర్వాయర్ నిర్మాణంతో తమ జీవనాధారమైన భూములను కోల్పోవాల్సి వస్తుందని ఆందోళనకు దిగారు. అధికారులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని రైతులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. సర్వేను అడ్డుకుంటే చర్యలుంటాయని.. సహకరించాలని పోలీసులు కోరినా రైతులు వినలేదు. దీంతో రైతులను బలవంతంగా డీసీఎంలో ఎక్కించి ఉప్పునుంతల స్టేషన్‌కు తరలించారు. ఇదిలా ఉంటే, తమ సమస్యలను వినకుండానే సర్వే చేయడం ఏంటని పలువురు రైతులు ప్రశ్నించారు. భూములు కోల్పోయే వారంతా నిరుపేదలేనని.. వ్యవసాయమే తమ జీవనాధారమన్నారు. తాము ప్రాజెక్టులకు వ్యతిరేకం కాదని.. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరారు. పోలీసులు బలవంతంగా తమను అరెస్టు చేయడం సరికాదన్నారు. కాగా, పోలీసు బందోబస్తు మధ్య సర్వే పనులు కొనసాగించారు.


రైతులను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

పల్లె దవాఖానలో కేంద్ర బృందం తనిఖీ

వెల్దండ: మండలంలోని కొట్ర పల్లె దవాఖానలో బుధవారం కేంద్ర వైద్య బృందం ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. జాతీయ ఆరోగ్య మిషన్ పాపులేషన్ రీసెర్చ్ సెంటర్‌కు చెందిన వైద్యుల బృందం పల్లె దవాఖానలో పలు రికార్డులను పరిశీలించడంతో పాటు వైద్యసేవలపై ఆరా తీశారు. సాధారణ రోగులకు పరీక్షలు, అందిస్తున్న మందులు, దీర్ఘకాలిక వ్యాధులకు ఇచ్చే మందులు తదితర వివరాలను తెలుసుకున్నారు. ఆన్‌లైన్‌లో వివరాల నమోదును పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్లు నవీన్‌కుమార్, సింధు, సిబ్బంది మురళీకృష్ణ, అనిత, జానకి, ఎల్లమ్మ, లక్ష్మీబాయి, రాణిబాయి. శ్రీదేవి, పద్మ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషిచేయాలి


విద్యార్థిని అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీఈఓ రమేష్ కుమార్

అచ్చంపేట రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కృత్యాధార విధానం ద్వారా బోధించి, వారి సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని డీఈఓ రమేష్ కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం అచ్చంపేట మండలం రంగాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలతో పాటు పాఠశాల రికార్డులను పరిశీలించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. పాఠశాల ప్రాంగణంతో పాటు క్లాస్ రూంలను శుభ్రంగా ఉంచాలన్నారు. ఉపాధ్యాయులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. డీఈఓ వెంట ఎంఈఓ జీవన్ కుమార్, స్టాంగ్ టీచర్ రఘునాథ్‌రెడ్డి, సీఆర్పీ సత్య ఉన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

● ఇద్దరికి గాయాలు



ఇర్ఫాన్ (ఫైల్)

ఊట్కూర్: ఆర్టీసీ బస్సు, స్కూటీ ఎదురెదురుగా ఢీకొని ఇర్ఫాన్ (19) మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయిన ఘటన బుధవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ఊట్కూర్ గ్రామానికి చెందిన ఇర్ఫాన్, షాహబాజ్, షిఫాయతుల్లా అనే ముగ్గురు యువకులు బస్టాండ్ నుంచి చెక్‌పోస్టుకు స్కూటీపై వెళ్తున్నారు. ఊరల క్ష్మమ్మ ఆలయం సమీపంలో ముందుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో మక్తల్ నుంచి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టారు. దీంతో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. గుర్తించిన స్థానికులు చికిత్స కోసం క్షతగాత్రులను నారాయణపేట ఆస్పత్రికి తరలించారు. బాధితుల పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఇర్ఫాన్, షహబాజ్ పరిస్థితి మరింత విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా.. మార్గమధ్యలోనే ఇర్ఫాన్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఇర్ఫాన్ బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. మృతుడికి తండ్రి ఇస్మాయిల్, తల్లి, ఇద్దరు సోదరులు ఉన్నారు. షిఫాయతుల్లా ఎస్‌వీఎస్ ఆస్పత్రిలో, షహబాజ్ హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న సీఐ చంద్రశేఖర్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణంరాజు తెలిపారు.

అమరవాయి సమీపంలో..

మల్దకల్: మండలంలోని అమరవాయి స్టేజీ సమీపంలోని స్పీడ్ బ్రేకర్ వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి.. అయిజ పట్టణానికి చెందిన ఈడిగ సరస్వతమ్మ(54) తన మరిది ప్రతాప్‌గౌడ్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై గద్వాల నుంచి తిరిగి వస్తుండగా.. అమరవాయి స్టేజీ సమీపంలో ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్ వద్ద మోటారు సైకిల్ అదుపుతప్పి కిందపడ్డారు. మోటారు సైకిల్‌పై ఉన్న ఇద్దరు కిందపడటంతో ప్రతాప్‌గౌడ్ స్వల్పగాయాలు కాగా సరస్వతమ్మ తీవ్రంగా గాయపడడంతో చికిత్స నిమిత్తం గద్వాల ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు సరస్వతమ్మ అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి భర్త కొన్నేళ్ల క్రితం మృతి చెందగా.. ఆమెకు ముగ్గురు సంతానం ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

అడ్డాకుల: ఇంట్లో ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ ఎం.శ్రీనివాస్ కథనం ప్రకారం.. మండలంలోని నాగాయపల్లి గ్రామానికి చెందిన గద్దెగూడెం చెన్నయ్య(24) గ్రామంలో ఉంటూ తల్లితో కలిసి కూలీ పనులు చేసేవాడు. మంగళవారం రాత్రి ఇంట్లో భోజనం చేసిన తర్వాత దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం తెల్లవారుజామున నిద్ర నుంచి లేచిన తల్లికి కుమారుడు దూలానికి వేలాడుతూ కనిపించాడు. దీతో ఆమె బోరున విలపించి చుట్టు పక్కల వారిని పిలిచి మృతదేహాన్ని కిందకు దించారు. యువకుడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియ రాలేదు. మృతుని తండ్రి గతంలో చనిపోయాడు. తమ్ముడు హైదరాబాద్‌లో ఉంటూ పని చేస్తున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. తల్లి వెంకటమ్మ ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వలస కూలీపై దాడి

● అస్వస్థతకు గురై మృతి



శాంతమ్మ (ఫైల్)

మదనాపురం: బతుకుదెరువు కోసం వలసవెళ్లిన కూలీపై ఓ వ్యక్తి దాడికి పాల్పడటంతో మృతి చెందింది. ఈ ఘటన మదనాపురం మండలం దుప్పల్లిలో కలకలం రేపింది. మృతురాలి కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. దుప్పల్లికి చెందిన రమేష్ నాయక్ భార్య కేత్లావత్ శాంతమ్మ (30) మూడు నెలల క్రితం కొత్తకుంట్ల మండలం అప్పంపల్లికి చెందిన రాఘవారెడ్డి అనే మేస్త్రి గుంపులో కరీంనగర్ జిల్లాకు వలస వెళ్లింది. అక్కడ పని విషయంలో లక్ష్మణ్ అనే వ్యక్తితో గొడవ జరిగింది. ఈ క్రమంలో శాంతమ్మపై దాడికి పాల్పడటంతో అస్వస్థతకు గురైంది. అక్కడి నుంచి ఆమె మంగళవారం రాత్రి ఇంటికి చేరుకొని జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేసింది. ఈ విషయంపై మరుసటి రోజు పోలీసులకు ఫిర్యాదు చేయాలని అనుకున్నారు. రాత్రి కుటుంబ సభ్యులతో కలసి నిద్రించిన శాంతమ్మ.. తీవ్ర అస్వస్థతకు గురై మృతిచెందింది. మృతురాలికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు మృతురాలి భర్త రమేష్ నాయక్ ఫిర్యాదు చేసినట్లు ఆత్మకూర్ సీఐ శివకుమార్ తెలిపారు.

అలంపురం.. ఆధ్యాత్మిక సంబురం



విద్యుద్దీపాల అలంకరణలో ఆలయం

నేటి నుంచి జోగుళాంబ వార్షిక బ్రహ్మోత్సవాలు

● ఐదురోజుల పాటు కొనసాగింపు
● ఆలయాల్లో ప్రత్యేక పూజలు.. నిజరూప దర్శన భాగ్యం
● చివరిరోజు సహస్ర కలశాలతో అభిషేకం
● భారీగా హాజరుకానున్న ప్రముఖులు, భక్తులు

అలంపూర్: అష్టాదశ శక్తిపీఠాల్లో ఐదవది అయిన అలంపూర్ జోగుళాంబ అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ఫిబ్రవరి 3 వరకు ఐదురోజుల పాటు కొనసాగనున్నాయి. ఏటా అమ్మవారి ఆలయంలో జరిగే ప్రముఖ ఉత్సవాల్లో వార్షిక బ్రహోత్సవాలు ప్రత్యేకమని.. వైభవోపేతంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఈఓ పురేందర్‌కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఉత్సవాల చివరిరోజు సహస్ర ఘటాభిషేకం, అమ్మవారి నిజరూప దర్శన భాగ్యం భక్తులకు కలగనుంది. జోగుళాంబ అమ్మవారు ఆరు దశాబ్దాలుగా బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో పూజలందుకుంటున్నారు. 2005, ఫిబ్రవరి 13 వసంత పంచమి రోజున అమ్మవారి ఆలయంలో పునః ప్రాణప్రతిష్ట జరిగింది. నాటి నుంచి నేటి వరకు బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి.



జోగుళాంబ అమ్మవారి మూల విగ్రహం

పూజా కార్యక్రమాలు ఇలా..

- గురువారం ఉదయం 8 గంటలకు యాగశాల ప్రవేశం, పుణ్యాహవాచనం, మహాగణపతి పూజ, రుత్విక్‌వరణం, మహా కలశస్థాపన పూజలు జరగనున్నాయి. సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ, ధ్వజారోహణం నిర్వహించనున్నారు.
- శుక్రవారం నుంచి ఫిబ్రవరి 2 వరకు విశేష అర్చనలు, చండీహోమాలు, పవమానసూక్త పారాయణం, పవమాన సూక్త హోమాలు, ఆవాహిత దేవతా హోమాలు, మండపారాధన, బలిహరణం, నీరాజన మంత్రపుష్ప పూజలు ఘనంగా కొనసాగనున్నాయి.
- చివరిరోజు ఫిబ్రవరి 3 వసంత పంచమి రోజున ఉదయం 9 గంటలకు యాగశాలలో నిత్యహోమాలు, మహా పూర్ణాహుతి, కలశ ఉద్వాసన, సహస్ర ఘటాలకు ఆవాహన అర్చన, అమ్మవారి మూల విగ్రహానికి అవభృత స్నానం, పంచామృతాలతో అభిషేకం, సహస్ర కలశాలతో అభిషేకం నిర్వహించనున్నారు. జోగుళాంబ అమ్మవారి నిజరూప దర్శనం ఉంటుంది. సాయంత్రం 4 గంటలకు బాలబ్రహ్మేశ్వరస్వామి, జోగుళాంబ అమ్మవారి శాంతి కల్యాణం నిర్వహించనున్నారు.

ఏర్పాట్లు పూర్తి..



అలంపూర్ జోగుళాంబ అమ్మవారి వార్షిక బ్రహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన సౌకర్యాలు కల్పించాం. అమ్మవారిని ప్రశాంత వాతావరణంలో భక్తులు దర్శించుకునేలా చూస్తాం.

– పురేందర్‌కుమార్, ఈఓ, అలంపూర్

కురుమూర్తిలో గోవింద నామస్మరణ



గిరి ప్రదక్షణకు హాజరైన భక్తులు

● తరలివచ్చిన భక్తులు

చిన్నచింతకుంట: తెలంగాణ ప్రజల ఆరాధ్య దైవం అమ్మాపురం కురుమూర్తి స్వామి దర్శనానికి అమవాస్యను సందర్భంగా బుధవారం భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి సుప్రభాత సేవ అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఉదయం నుంచే ఉమ్మడి పాలమూరు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలొచ్చి క్యూలో ఉన్నారు. మెట్లపై దీపాలు వెలిగిస్తూ గోవింద నామస్మరణ చేశారు. మెట్టు మెట్టుకు కొబ్బరి కాయలు కొట్టి స్వామిని దర్శించుకున్నారు. కొందరు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మట్టికుండలో పచ్చిపులుసు అన్నం నైవేద్యంగా స్వామికి సమర్పించారు. అనంతరం అలివేలు మంగమ్మ, చెన్నకేశవస్వామి, ఆంజనేయ స్వామి, ఉద్దాల మండపం వద్ద భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు.

ఘనంగా గిరి ప్రదక్షణ

కురుమూర్తి స్వామి ఆలయం వద్ద గిరి ప్రదక్షణ ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, విశ్వహిందూ పరిషత్, బీజేపీ నాయకులు స్వామి వారి రాజగోపురం వద్ద పూజలు నిర్వహించారు. రాజగోపురం ప్రధాన మెట్లనుంచి స్వామి వారి ప్రధాన ఆలయం పక్కన, కలశపూజ మండపం పక్క నుంచి మట్టి అమ్మాపురం గ్రామం మీదుగా ఐదు కిలోమీటర్లు స్వామి వారి ఆలయం వరకు ప్రదక్షణలు చేశారు.



కురుమూర్తి స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

వాటర్ పైపు పడి.. హాస్టల్ విద్యార్థిని తలకు గాయం

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో బుధవారం ఓ విద్యార్థిని తలపై వాటర్ పైపు పడటంతో తీవ్రగాయమైంది. వివరాల్లోకి వెళ్తే.. ఇంటర్మీడియట్ (ఒకేషనల్) ద్వితీయ సంవత్సరం చదువుతున్న నందిని హాస్టల్ గదిలో ఉండగా.. ప్రమాదవశాత్తు వాటర్ పైపు పడటంతో తలకు తీవ్ర గాయమై రక్తస్రావమైంది. గమనించిన హాస్టల్ సిబ్బంది చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. విద్యార్థిని తలకు వైద్యులు 15 కుట్లు వేశారు. మెరుగైన వైద్యం కోసం జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశారు. ప్రస్తుతం విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. కాగా, హాస్టల్ వద్ద ఉన్న వాటర్ పైపును కోతులు పెకిలించడంతో కింద పడిందని హాస్టల్ సిబ్బంది తెలిపారు. పైపులైన్ సరి చేయిస్తామని.. విద్యార్థిని నందినికి మెరుగైన వైద్యం చేయిస్తున్నామని వార్డెన్ ఎల్లమ్మ తెలిపారు.

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

ఎర్రవల్లి: చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందిన ఘటన కోదండాపురం పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ స్వాతి కథనం మేరకు.. రాజోళి మండల కేంద్రానికి చెందిన రవికుమార్ కొంతకాలంగా మానవపాడు మండలంలోని చందూరులో కోళ్ల ఫారం లీజుకు తీసుకుని అక్కడే నివాసం ఉంటున్నాడు. మంగళవారం ఉదయం తన కుమార్తె రక్షిత (2)ను ఊయలలో పడుకోబెట్టి కూలర్ వేసి పనులు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో షార్ట్‌సర్క్యూట్‌తో కూలర్‌లో ఒక్కసారిగా మంటలు వ్యాప్తి చెందడంతో పక్కనే ఉన్న చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన కర్నూల్‌కు తరలించారు. పరిస్థితి విషమించి బుధవారం చిన్నారి మృతి చెందింది. చిన్నారి తండ్రి ఫిర్యాదు మేరకు ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఆటోను తగల పెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు



కాలిపోయిన ఆటో

మహబూబ్‌నగర్ క్రైం: ఇంటి ఎదుట నిలిపి ఉన్న ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు తగలపెట్టారు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని కుమ్మరివాడిలో నివాసం ఉంటున్న వెంకటేష్ తనకు సంబంధించిన ఆటోను రోజు మాదిరిగానే ఇంటి ఎదుట నిలిపాడు. అయితే గుర్తు తెలియని వ్యక్తులు ఆటోపై పెట్రోల్ పోసి తగలపెట్టారు. దీంతో పాటు పక్కనే ఉన్న బోర్ మోటార్‌కు సైతం నిప్పు పెట్టారు. ఆటో పూర్తిగా దగ్ధం కావడంతో పాటు పక్కనే ఓ ఇంటికి సైతం మంటలు అంటుకోవడంతో పాక్షికంగా దగ్ధమైంది. అప్పటికే గుర్తించిన కుటుంబ సభ్యులు నీటితో మంటలను అదుపు చేశారు. దాదాపు రూ.1.50లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు తెలిపారు.

గగన్‌చంద్రకు అభినందన ర్యాలీ



గగన్‌చంద్ర త్రీ ఇన్ వన్ సైకిల్‌తో ఊరేగింపుగా తీసుకెళ్తున్న విద్యార్థులు

● గగన్ రూపొందించిన త్రీ ఇన్ వన్ హైబ్రిడ్ బైస్కిల్ జాతీయ స్థాయికి ఎంపిక
● బల్మూర్ ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రతిభ

బల్మూర్: పాండిచ్చేరిలో ఈనెల 20 నుంచి 25 వరకు నిర్వహించిన దక్షిణ భారతదేశ స్థాయి సైన్స్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌లో బల్మూర్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి జి.గగన్‌చంద్ర రూపొందించిన త్రీ ఇన్ వన్ హైబ్రిడ్ బైస్కిల్ మూడో స్థానం పొంది జాతీయ స్థాయికి ఎంపికైంది. దీంతో బుధవారం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యా ర్థులు మండల కేంద్రంలో గగన్‌చంద్రను ర్యాలీగా ఊరేగించి అభినందన సభ నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల హెచ్ఎం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి గగన్‌చంద్ర ఇప్పటికే పలు విజ్ఞాన సదస్సుల్లో పాల్గొని తాను తయారు చేసిన వివిధ రకాల వస్తువులతో ఉత్తమ బహుమతులు సాధించినట్లు తెలిపారు. గగన్‌చంద్ర చిన్న వయసులోనే తన మేధోశక్తితో ట్రాన్స్‌పోర్ట్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో కరెంటు చార్జింగ్, సోలార్ ప్యానల్, పెట్రోల్‌తో నడిచే త్రీ ఇన్ వన్ బైస్కిల్‌ను తయారు చేసి జాతీయ స్థాయికి ఎంపికయ్యారని కొనియాడారు. భవిష్యత్‌లో విద్యార్థి గగన్‌చంద్ర మరిన్ని ఉత్తమ ప్రయోగాలతో రాణించాలని ఆకాంక్షించారు. ఎస్ఐ రమాదేవి, యూనియన్ బ్యాంక్ మేనేజర్ పవన్ గగన్‌చంద్రను శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థి తల్లిదండ్రులు భాస్కర్, నాగరాణి, ఉపాధ్యాయులు రజాక్, శ్రీధర్‌రావు, అనురాధ, శ్రీను, సీతారాం, రమేష్, లక్ష్మణ్, హర్యానాయక్, మోతీబాయి, నిర్మల, నానకమ్మ, కమలాబాయి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పంటపొలంలో కొండచిలువ



వనపర్తి మండలం ఎర్రగట్టు తండా వద్ద పట్టుకున్న భారీ కొండచిలువను చూపిస్తున్న సాగర్ స్నేక్స్ సొసైటీ సభ్యులు, రైతులు

వనపర్తి: వనపర్తి మండలం కాశీంనగర్ సమీపంలోని ఎర్రగట్టు తండాకు కూత వేటు దూరంలోని వ్యవసాయ పొలంలో సుమారు 11 ఫీట్ల కొండచిలువ బుధవారం రైతుల కంట పడింది. ఒక్కసారిగా భయపడి రైతులు, కూలీలు గట్టిగా కేకలు పెట్టారు. వెంటనే సాగర్ స్నేక్స్ సొసైటీ వారికి సమాచారం అందించారు. స్పందించిన సొసైటీ టీం అక్కడికి చేరుకొని పంటకు రక్షణగా రైతులు ఏర్పాటు చేసుకున్న వలకు చిక్కిన సుమారు 18 కేజీల కొండచిలువను పట్టుకున్నారు. ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించి అటవీ ప్రాంతంలో వదిలి పెట్టినట్లు సాగర్ స్నేక్స్ సొసైటీ నిర్వాహకులు కృష్ణసాగర్ తెలిపారు.

నేటి నుంచి లక్ష్మీచెన్నకేశవుడి బ్రహ్మోత్సవాలు



ఆలయ రాజగోపురం

● ఫిబ్రవరి 6 వరకు కొనసాగనున్న గంగాపురం జాతర
● ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ, అధికారులు

జడ్చర్ల టౌన్: కృతయుగంలో మత్స్యపురంగా.. త్రేతాయుగంలో దురితకోలాహలంగా.. ద్వాపర యుగంలో మాయాపురంగా పిలువబడి కలియుగంలో గంగాపురంగా పిలుచుకుంటున్న లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతి ఏటా మాఘశుద్ధ పాడ్యమి మొదలు నవమి వరకు ఉత్సవాలు కొనసాగుతాయి. ఫిబ్రవరి 6వ తేదీ వరకు జరిగే ఉత్సవాలకు సంబంధించి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవాలకు ఆలయం పడమర ప్రాంతం నుంచి, తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి సైతం భక్తులు రానున్నారు.

10వ శతాబ్దంలో ఆలయం నిర్మాణం

జడ్చర్ల మండలం గంగాపురంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం నాటి శిల్పుల కళానైపుణ్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఆలయం 10వ శతాబ్దంలో నిర్మించినట్లుగా ఆనవాళ్లున్నాయి. కోణార్క్ సూర్యదేవాలయం, గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం ఒకే విధంగా నిర్మించారని ప్రతీతి. ఆలయం చతురస్రాకారంలో నిర్మితమై ఉండటం ఇందుకు నిదర్శనంగా చెబుతున్నారు. ఆలయప్రాంగణంలో నిర్మించిన కోనేరు పలు ప్రత్యేకతలను నిలుపుకుంది.

ఏర్పాట్లు పూర్తి

మహబూబ్‌నగర్ ఆర్డీఓ నవీన్ పర్యవేక్షణలో జాతర కోసం ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యులు సమన్వయంతో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయంలో పెయింటింగ్, శుద్ధి చేసే ప్రక్రియ, ప్రాకారాలు, కోనేరు ఇతరు నిర్మాణాలకు 40మందితో జాజు పూయించారు. ఆలయ ప్రాంగణం, వెనకాల భక్తులు వంటా వార్పు చేసుకునేందుకు గానూ చదునుచేసి సిద్ధంగా ఉంచారు. కోనేటిలో భక్తులు స్నానాలు ఆచరించేందుకు గానూ నీటిని నింపుతున్నారు.



స్వామివారి మూలవిగ్రహం

బ్రహ్మోత్సవ వివరాలు..

గురువారం అలంకారాభిషేకంతో ప్రారంభం కానున్న ఉత్సవాలు. తొలిరోజున స్వామి, అమ్మవారికి అష్టోత్తర శతకలశాభిషేకం, నూతన వస్త్రాల అలంకరణతో ఉత్సవాలను ప్రారంభిస్తారు. 31 శుక్రవారం విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణం, మృత్సంగ్రహణం, అంకురార్పణం, అగ్నిప్రతిష్ఠ, పల్లకీసేవ నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 1న ధ్వజారోహణం, ప్రాణప్రతిష్ట, బలిహరణం, 2న ఆదివారం రాత్రికి ఎదుర్కోలు, స్వామి, అమ్మవార్ల కల్యాణం, సోమవారం మనోహరమైన శేష, హంస వాహన సేవలు, పుష్పరథం (చిన్నతేరు), మంగళవారం రథసప్తమి సందర్భంగా పెద్ద తేరు (రథోత్సవం), బుధవారం శకటోత్సవం (బండ్లు తిప్పుట), గురువారం పూర్ణాహుతి, చక్రతీర్థంతో ఉత్సవాలు ముగియనున్నాయి.

సర్వం సిద్ధం

ప్రతి ఏటా మాఘమాసంలో నిర్వహించే బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశాం. గురువారం నుంచి ఫిబ్రవరి 6 వరకు భక్తుల రాకపోకల కోసం ప్రత్యేక బస్సులు నడిపించాలని ఆర్టీసీ అధికారులను కోరాం. అలాగే రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్యశాఖల సహకారం తీసుకుంటున్నాం. ఆలయంలోనూ విద్యుత్ స్తంభాల ఆధునీకరణ, కాటేజ్ నిర్మాణం, సీసీ రోడ్డు లాంటివి నూతనంగా చేపట్టాం.

– దీప్తిరెడ్డి, కార్యనిర్వహణాధికారి, గంగాపూర్ ఆలయం

టీడీసీఏ టోర్నీ ఫైనల్‌కు ఉమ్మడి జిల్లా జట్టు

● సెమీఫైనల్‌లో ఆదిలాబాద్‌పై ఘన విజయం
● రాణించిన దీపక్‌పాటిల్, రవితేజ



దీపక్ పాటిల్ (54పరుగులు నాటౌట్)

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లోని దోమలగూడలో జరుగుతున్న తెలంగాణ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ అంతర్‌జిల్లా టీ–20 క్రికెట్ టోర్నమెంట్‌లో ఉమ్మడి జిల్లా జట్టు అద్భుత ఆటతీరు ప్రదర్శిస్తోంది. బుధవారం ఆదిలాబాద్ జట్టుతో జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు 8 వికెట్ల తేడాతో విజయం సాధించి ఫైనల్‌లో అడుగుపెట్టింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఆదిలాబాద్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 116 పరుగులకు ఆలౌటైంది. ప్రియాన్ 23, షేక్ అర్భాన్ 20 పరుగులు చేశారు. మహబూబ్‌నగర్ బౌలర్లు రవితేజ 4 ఓవర్లలో 10 పరుగులు ఇచ్చి 3 వికెట్లు, సాహిల్ 4 ఓవర్లలో 20 పరుగులు ఇచ్చి 3 వికెట్లు, గౌతం, రాంచరణ్ చెరో వికెట్ తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఉమ్మడి జిల్లా జట్టు 16.1 ఓవర్లలో కేవలం 2 వికెట్లు కోల్పోయి 121 లక్ష్యాన్ని చేధించింది. దీపక్ పాటిల్ 47 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 54 పరుగులకు నాటౌట్, రవితేజ 32 బంతుల్లో 6 ఫోర్లతో 38 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు.

ఉమ్మడి జిల్లా జట్టుకు అభినందనలు

టీడీసీఏ అంతర్‌జిల్లా టోర్నీలో ఫైనల్‌కు చేరడంపై ఉమ్మడి జిల్లా జట్టును ఉమ్మడి జిల్లా కన్వీనర్ నవీన్‌కుమార్, జట్టు కోచ్ నవాజ్‌షా, మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు. అంతర్‌జిల్లా టోర్నమెంట్‌లో ఉమ్మడి జిల్లా జట్టు చక్కటి ఆటతీరును ప్రదర్శిస్తున్నారని, ఇదే స్ఫూర్తితో ఫైనల్‌లో సత్తా చాటి చాంపియన్‌షిప్‌ను కై వసం చేసుకోవాలని వారు ఆకాంక్షించారు. అంతకుముందు సెమీఫైనల్ మ్యాచ్‌ను తెలంగాణ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి ప్రారంభించి ఆయా క్రీడాజట్లను అభినందించారు.